ఏవీ సుబ్బారెడ్డికి గన్‌మెన్ల కేటాయింపు

నంద్యాల(నూనెపల్లె) ఏప్రిల్ 18 : టీడీపీ సీనియర్ నాయకుడు, ఏపీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డికి 1 ప్లస్ 1 గన్‌మెన్లను కేటాయించాలని హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో తనకు ప్రాణహానీ ఉందని భావించి ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు 1 ప్లస్ 1 గన్‌మెన్లను కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

- నందికొట్కూరు వైసీపీ కార్యాలయంలో వలంటీర్లతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- రాజీనామా చేయమని వలంటీర్లకు ఓ వైసీపీ నాయకుడి హుకుం
- రాజీనామాపై మల్లగుల్లాలు పడుతున్న వలంటీర్లు

నందికొట్కూరు, ఏప్రిల్ 18: ప్రభుత్వం నుంచి వేతనం తీసుకుంటున్న వలంటీర్లతో ఎన్నికల సమావేశం నిర్వహించి వైసీపీ నాయకులు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. గురువారం నందికొట్కూరు వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ వలంటీర్లతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు టీడీపీ అధికారంలోకి వస్తే రూ.10 వేలు వేతనం ఇస్తామన్న హామీని వలంటీర్లు నమ్మవద్దని హితవుపలికారు. వలంటీర్లు వైసీపీకే తమ మద్దతు తెలపాలని సూచించారు.

రాజీనామాలు చేయండి: ఓ వైసీపీ నాయకుడి హుకుం

నియోజకవర్గంలోని వలంటీర్లు అందరూ రాజీనామా చేసి వైసీపీ గెలుపు కోసం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఓ నాయకుడు సూచించినట్లు తెలుస్తోంది. వైసీపీ తిరిగి అధికారంలోకి వచ్చాక ఎవరి ఉద్యోగం వారికే కేటాయిస్తామని సమావేశంలో చెప్పినట్లు తెలుస్తోంది. సమావేశం అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు తమను కేటాయించారని, రాజీనామా చేసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనమని చెప్పడం సరైంది కాదన్నారు. పార్టీని గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు ఉండగా తమను ఇబ్బంది పెట్టడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో రాజీనామా చేస్తే ఒక పార్టీకి సంబంధించిన వారుగా ముద్రపడుతుందన్న భావనలో వారు ఉన్నారు. రాబోయే ప్రభుత్వం తమకే వలంటీర్ పోస్టులు ఇస్తుందనే గ్యారెంటీ ఏముందని వారు సందేహంలో ఉన్నారు.

సార్వత్రిక ఎన్నికల ఫైట్ షురూ..!

తొలిరోజు తొమ్మిది నామినేషన్లు

నంద్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ షురూ అయింది. జిల్లాలో మొదటి రోజు ఒక్క శ్రీశైలం నియోజకవర్గం నుంచి మినహా మిగతా చోట్ల నుంచి ప్రధాన పార్టీల నాయకులెవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులు, ఎస్‌డీపీఐ (సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా), బీఎస్పీ (బహుజన సమాజ్ పార్టీ) నుంచి ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, నంద్యాల పార్లమెంటు నియోజకవర్గానికి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వెరసి మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ నుంచి బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆయన సతీమణి బుడ్డా శైలజ విడివిడిగా నామినేషన్లు దాఖలు చేశారు. ఇక అధికార పార్టీ నుంచి శిల్పా చక్రపాణిరెడ్డి నామినేషన్ దాఖలు చేయగా, జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ నుంచి పి. నాగేశ్వరరావు నామినేషన్ వేశారు. నంద్యాల అసెంబ్లీ నియోజవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసేందుకు స్వతంత్ర అభ్యర్థులైన విష్ణువర్ధన్‌రెడ్డి, బి శ్రవణ్ కుమార్ నామినేషన్లు వేయగా, ఎస్‌డీపీఐ నుంచి షేక్ మహమ్మద్ ఫాజిల్ నామినేషన్ దాఖలు చేశారు. నంద్యాల పార్లమెంటుకు సంబంధించి ఎస్‌డీపీఐకి చెందిన మహమ్మద్ అతుల్లా ఖాన్, బీఎస్పీ నుంచి చిన్న మౌలాలి నామినేషన్లు దాఖలు చేశారు. ఆళ్లగడ్డ, నందికొట్కూరు, బనగానపల్లె, డోన్ నియోజకవర్గం నుంచి తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.



మాట్లాడుతున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



శ్రీశైలంలో నామినేషన్ దాఖలు చేస్తున్న బుడ్డా రాజశేఖర్ రెడ్డి, పక్కనే మాజీ మంత్రి ఏరాసు



మాట్లాడుతున్న నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి

అభ్యర్థుల వ్యయాన్ని లెక్క కట్టండి

ఎన్నికల వ్యయ పరిశీలకులు



ఇంటిగ్రేటెట్ కమాండ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 18: పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పెట్టే ఖర్చులను ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు జాగ్రత్తగా నమోదు చేయాలని పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎస్ మణికందన్ ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు కిరణ్ తొట్టుపురం, అశోకన్, శ్రీశైలం, నందికొట్కూర్, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకుడు టికారం మీనా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నంద్యాల పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల సహాయ ఎన్నికల, సహాయ వ్యయ పరిశీలకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చు పెట్టే ఎన్నికల వ్యయాన్ని పరిశీలించి నమోదు చేసేందుకు సహాయ వ్యయ పరిశీలకులు చురుకుగా, సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు.

జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ పరిశీలన

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాకు నియమించిన వ్యయ పరిశీలకులు గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ, కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య ఎంసీసీ, ఎంసీఎంసీ, ఎలెక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సెల్, ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ సెల్, సీజర్స్ మొదలైన విభాగాల సిబ్బంది నిర్వర్తిస్తున్న విధుల గురించి వివరించారు.

కాటసానికి బుద్ధి చెప్పండి : మాజీ ఎమ్మెల్యే బీసీ

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 18 : ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి 2024 సార్వత్రిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బనగానపల్లె పట్టణంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా బీసీ జనార్దన్‌రెడ్డి బోయపేట, ఖాజీవాడ, గౌండా వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం బనగానపల్లె పట్టణానికి రింగ్ రోడ్డుకు రూ.50 కోట్ల రూపాయలు మంజూరు చేయించి రింగురోడ్డు నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచారని అన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆ టెండర్లను రద్దు చేసి మళ్లీ కొత్తగా టెండర్లను పిలిచారన్నారు. అయితే రింగ్ రోడ్డుకు బైపాస్ అని పేరు మార్చడం తప్ప ఒక్క పని కూడా చేపట్టలేదని అన్నారు. మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రింగురోడ్డు పూర్తి చేస్తామని బీసీ జనార్దనరెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు బీసీ జనార్దన్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు అందజేసి ప్రచారం చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- డివైడర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు..
- ముగ్గురికి గాయాలు

ఓర్వకల్లు, ఏప్రిల్ 18: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై పూడిచెర్ల బస్టాండు సమీపంలో ఓ ట్రావెల్స్ బస్సు డివైడర్‌ను గురువారం తెల్లవారుజామున ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురుకి గాయా లయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి ఎస్ఐ రాజారెడ్డి చేరుకుని ప్రయాణికులను ఇతర వాహనాల్లో తరలించారు. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరుపతి నుంచి హైదరాబాదు వెళ్తున్న ఏపీ 39యుజే7804 శ్రీకార్తీక్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ శ్రీనివాసులు అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ఈ ప్రమాదం సంభవించింది. చిత్తూరు జిల్లా పుత్తూరు గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ శ్రీనివాసులు (55), బస్సులో ప్రయాణిస్తున్న రాజంపేటకు చెందిన రాము(40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో ఉన్న క్లీనర్ శ్రీనివాసులు, కడపకు చెందిన ఓబయ్య, సోమశేఖర్ రెడ్డిలకు స్వల్పగాయాలయ్యాయి. బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.



ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు ఇదే

చాలా బాధగా ఉంది..

- ఒక లక్ష్యంతో పార్టీలోకి వచ్చాను
- కోడుమూరుకు దూరంగా ఉండలేకున్నా..
- సభలో కంటతడి పెట్టిన కోట్ల

కోడుమూరు, ఏప్రిల్ 18: 'చాలా బాధగా ఉంది. ఇన్నేళ్లపాటు నన్ను, మా కుటుంబాన్ని ఇంతగా ఆదరించిన మిమ్మల్ని విడిచి దూరంగా ఉండాలంటే చాలా కష్టంగా ఉంది...' అంటూ మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు. కోడుమూరు నియోజకవర్గ ప్రజలు తన కుటుంబాన్ని ఎంతగానో ఆదరించారని, వారందరినీ వదిలి డోన్‌లో పోటీ చేస్తున్నానన్నారు. కోడుమూరులో గురువారం కోట్ల కుటుంబం అభిమానులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని వీడి ఒక లక్ష్యంతో టీడీపీలోకి వచ్చానని అన్నారు. ఆర్డీఎస్, ఎల్లెల్సీ గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను సాధించేంత వరకు తాను నిద్రపోనన్నారు. 'కర్నూలు పార్లమెంటు నుంచి తాను పోటీ చేయలేదని 14 లక్షల మంది ఓటర్లు బాధపడుతున్నారు. కానీ డోన్ నియోజకవర్గంలోని రెండు లక్షల మంది ఓటర్లు సంతోషిస్తున్నారు. డోన్ ప్రజలు కూడా తన ఆత్మీయులే. పార్టీ ఆదేశాలను పాటించక తప్పడం లేదు..' చెప్పారు. అయితే కర్నూలు జిల్లా ప్రజలు తనకు దేవుళ్లలాంటి వాళ్లని, వారిని వదిలి వెళ్లిపోవడాన్ని తట్టుకోలేపోతున్నానని కంటతడి పెట్టారు. ముఖ్యంగా కోడుమూరు నియోజకవర్గ ప్రజలను వదిలిపెట్టి వెళ్లాలంటే తట్టుకోలేపోతున్నానని గద్గ స్వరంతో అన్నారు. కాసేపు ఆయన తన నోటి వెంట మాటలు రాలేకపోయాయి.

కాసేపు నిశబ్ద వాతావరణం

కోట్ల కుటుంబంపై తన అభిమానుల చూపిస్తున్న అభిమానం వర్ణిస్తూ కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి కంటతడి పెట్టారు. దీంతో అక్కడ నిశబ్ద వాతావరణం చేటు చేసుకుంది. కోట్ల కంటతడిని చూడలేక అక్కడ ఉన్న కోట్ల అభిమానులు కూడా కన్నీరు పెట్టారు. నిశబ్ద వాతావరణం నుంచి తేరుకున్న అనంతరం కోట్ల మాట్లాడుతూ పార్టీలో వర్గ విభేదాలు లేకుండా అందరూ కలిసి కట్టుగాపోతే తప్పకుండా టీడీపీ గెలుస్తుందని అన్నారు.



సభలో కంటతడి పెట్టిన కోట్ల

టీడీపీ గెలవాలి కాబట్టి అభిమానులంతా కలిసి కట్టుగా పని చేసి కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని గెలిపించాలని కార్యకర్తలను కోరారు. తప్పకుండగా టీడీపీ అధికారంలోకి వస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఒక రైతు బిడ్డగా రైతులకు ఇచ్చిన హామీలను తప్పకుండగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.

కోట్లను క్షమాపణ కోరిన నాగరాజు!

కోడుమూరు నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశానికి కర్నూలు ఎంపీ అభ్యర్థి నాగరాజు సమావేశానికి రెండు గంటలు ఆలస్యంగా వచ్చారు. కర్నూల్లో నామినేషన్ వేయడం వల్ల సభకు ఆలస్యంగా వచ్చినందుకు తనను క్షమించాలని నాగరాజు కోట్లను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచు భాగ్యరత్న, మాజీ సర్పంచు కేతః రాంబాబు, సీబీ లత, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ టీడీపీ నాయకులు కోట్ల కవితమ్మ, సుధాకర్‌రెడ్డి, గోవిందుగౌడ్, అమడగుంట్ల కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుమల్‌నాయుడు, సత్రం రామకృష్ణుడు పాల్గొన్నారు.

అయ్యప్పా.. కరుణించప్పా..!

సెంటిమెంట్



అయ్యప్పస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, ఏప్రిల్ 18: శ్రీశైలం నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల టీడీపీ అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేసిన మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఎప్పటిలాగే తన సెంటిమెంట్‌ను కొనసాగించారు. తన నామినేషన్ పత్రాలను మూడు ఆలయాల్లో ఉంచి పూజలు చేశారు. కుటుంబసమేతంగా నల్లకాల్వ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ఆ తర్వాత ఆత్మకూరులోని సాయిబాబా, అయ్యప్ప స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించి తనకు విజయం వరించాలని సంకల్పించారు. మధ్యాహ్నం 1:26 గంటల సమయంలో అయ్యప్పస్వామి ఆలయం ఎదుట పడిమెట్ల వద్ద నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి అక్కడి నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని ఆర్వో సుధారాణికి నామినేషన్ పత్రాలను అందజేశారు.

నువ్వెవరో నాకు తెలీదు.. కానీ..



శతాధిక వృద్ధుడితో మాట్లాడుతున్న జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 18: ఎన్నికల ప్రచారానికి వెళ్లిన నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్యకు ఓ శతాధిక వృద్ధుడి నుంచి విచిత్ర అనుభవం ఎదురైంది. గురువారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి జయసూర్య ఎన్నికల ప్రచార నిమిత్తం వెళ్లారు. ఈ క్రమంలో శతాధిక వృద్ధుడు సుభాన్‌ను జయసూర్య ఓటు వేయాలంటూ అభ్యర్థించాడు. అయితే 'నువ్వెవరో నాకు తెలీదు. కానీ తెలుగుదేశం పార్టీకే నేను ఓటు వేస్తా. నాకు తెలుగుదేశం పార్టీ, సైకిల్ గుర్తు తెలుసు. సైకిల్ గుర్తుకే ఓటు వేస్తాను. పేద, మధ్య తరగతి ప్రజల కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం' అంటూ సమాధానమిచ్చాడు. అభ్యర్థి ఎవరో తెలియకుండానే ఆ శతాధిక వృద్ధుడు టీడీపీకే ఓటు వేస్తానని చెప్పడంతో జయసూర్య ఆశ్చర్యపోయారు.

మా నాన్నను గెలిపించరూ..!



చనుగొండ్లలో ప్రచారం చేస్తున్న బీసీ మనోరమరెడ్డి

అవుకు, ఏప్రిల్ 18: బనగానపల్లె నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాలు ఊపందుకుంటున్నాయి. రాజకీయ పార్టీల నాయకులతోపాటు వారి కుటుంబ సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం దాకా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి కుమార్తె బీసీ మనోరమ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. 'మా నాన్నను గెలిపించండి..' అంటూ ప్రజలతో మమేకమవుతున్నారు. గురువారం అవుకు మండలంలోని చనుగొండ్ల గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ క్రమంలో కరపత్రాలను పంచుతూ టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలంటూ ముందుకెళ్లారు.

ఎన్నికల కమిషన్ ఎప్పుడు ఏర్పాటైందంటే..



నందికొట్కూరు: భారత ఎన్నికల కమిషన్ 1950, జనవరి 25న ఏర్పాటైంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ ముఖ్య ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు.

- 2011 జనవరి 25న తొలి జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.
- 2004నుంచి భారత ఎన్నికల సంఘం ఎగ్జిట్ పోల్ ఫలితాలను నిషేధించింది. ఎన్నికల తర్వాత చేసే సర్వేలను పోస్టు పోల్ సర్వే అంటారు.
- 1993లో ఓటరు గుర్తింపు కార్డులను అప్పటి బారత ఎన్నికల ప్రధాన కమిషనర్ టీఎన్ శేషన్ హయాంలో ప్రవేశపెట్టారు. 2013లో ప్రప్రథమంగా సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా నోటా ఓటు ప్రవేశపెట్టారు.
- ఓటింగ్ యంత్రాలను 1999లో తొలిసారి గోవా రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో పూర్తి స్థాయిలో వినియోగించారు.
- 2013లో సుప్రీంకోర్టు ఓటింగ్ యంత్రాల్లో వీవీ ప్యాడ్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది.
- నోటా ఐచ్ఛికాన్ని 2013లో ప్రథమంగా ఢిల్లీ, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, మిజోరాం రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో వినియోగించారు.

ఉద్దండుల డోన్



కోట్ల, నీలం సంజీవరెడ్డిలకు ఆ అవకాశం
ముఖ్యమంత్రులుగా పని చేసిన వైనం
- రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువుగా నియోజకవర్గం

రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువుగా డోన్ గడ్డ మారింది. ఇక్కడి నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రాతినిధ్యం వహించారు. డోన్ నుంచి ఎన్నికైన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవిని అలంకరించగా.. సీఎం హోదాలో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇక్కడి నుంచే ఎన్నికయ్యారు. కేఈ కుటుంబం డోన్ నుంచి ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందింది. రాజకీయ ఉద్దండులు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో రాష్ట్ర రాజకీయాల్లో డోన్ ప్రత్యేక గుర్తింపు పొందింది.


- డోన్

● డోన్ తొలి ఎమ్మెల్యేగా కోట్రికే వెంకటశెట్టి

డోన్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలి ఎమ్మెల్యేగా కోట్రికే వెంకటశెట్టి ఎన్నికయ్యారు. 1952 సంవత్సరంలో డోన్ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి వెంకటశెట్టి గెలుపొందారు. ఆ తర్వాత 1967వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కోట్రికే కుటుంబం నుంచి కోట్రికే కృష్ణమూర్తి కూడా స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. డోన్ అసెంబ్లీకి రెండోసారి 1955లో జరిగిన ఎన్నికల్లో బుగ్గన శేషారెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అదేవిధంగా 1972 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో మేకల శేషన్న డోన్ అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

● ముఖ్యమంత్రులను అందించిన డోన్ గడ్డ:

రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఉన్న డోన్ గడ్డ ఇద్దరు ముఖ్యమంత్రులను అందించింది 1952వ సంవత్సరంలో డోన్ అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా నీలం సంజీవరెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డోన్ నుంచి ఎన్నికైన నీలం సంజీవరెడ్డి పని చేశారు. అయితే.. 1965 సంవత్సరంలో ముఖ్యమంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి నీలం సంజీవ రెడ్డి రాజీనామా చేయడంతో డోన్ అసెంబ్లీకి ఉప ఎన్నిక జరిగింది. ఆ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సి.రాంభూపాల్ రెడ్డి డోన్ నుంచి గెలుపొందారు. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి 1994 అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం హోదాలో డోన్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. కోట్ల కుటుంబం నుంచి 2004 అసెంబ్లీ ఎన్నికల్లో కోట్ల సుజాతమ్మ డోన్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.



● ఏడు సార్లు అధికారంలో కేఈ కుటుంబం

డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో కేఈ కుటుంబం నుంచి ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో మొదటి సారి కేఈ కృష్ణమూర్తి డోన్ అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ (ఐ) అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి, 1985 ఎన్నికల్లో టీడీపీ నుంచి, ఆ తర్వాత 1989లో కాంగ్రెస్ నుంచి వరుసగా డోన్ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పలు మంత్రి పదవుల్లోనూ కేఈ కృష్ణమూర్తి పని చేశారు. ఆ తర్వాత 1996లో డోన్ అసెంబ్లీకి ఉప ఎన్నిక జరిగింది. అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి రాజీనామా చేయడంతో జరిగిన ఉప ఎన్నికల్లో కేఈ ప్రభాకర్ టీడీపీ నుంచి పోటీ చేసి డోన్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లోనూ డోన్ నుంచి రెండోసారి కేఈ ప్రభాకర్ ఎన్నికయ్యారు. చంద్రబాబు క్యాబినెట్‌లో ఆయన మంత్రిగా పని చేశారు. 2009 ఎన్నికల్లో కేఈ కృష్ణమూర్తి మళ్లీ డోన్ అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అదేవిధంగా 2014 ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గెలిచి మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసి బుగ్గన విజయం సాధించారు. ఆర్థిక శాఖ మంత్రిగా బుగ్గన పని చేశారు.

● పునర్విభజనతో మారిన డోన్:

2009 సంవత్సరంలో దేశ వ్యాప్తంగా జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో డోన్ అసెంబ్లీ రూపురేఖలు మారిపోయాయి. 2009 ఎన్నికల ముందు వరకు డోన్ అసెంబ్లీ నియోజకవర్గం కర్నూలు పార్లమెంటులో ఉండేది. అంతేగాక డోన్ నియోజకవర్గంలో డోన్, ప్యాపిలి, క్రిష్ణగిరి, దేవనకొండ మండలాలు ఉండేవి. అయితే.. 2009 పునర్విభజనలో డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నంద్యాల పార్లమెంటులో కలిసిపోయింది. డోన్ నియోజకవర్గంలో ఉన్న క్రిష్ణగిరి మండలం పత్తికొండ నియోజకవర్గంలో, దేవనకొండ మండలం ఆలూరు నియోజకవర్గంలో కలిసిపోయాయి. డోన్, ప్యాపిలి మండలాలతోపాటు పాణ్యం నియోజకవర్గంలో ఉన్న బేతంచెర్ల మండలంతో డోన్ అసెంబ్లీ ఏర్పడింది.

ఇప్పటి వరకు డోన్ ఎమ్మెల్యేలు

సంవత్సరం	ఎమ్మెల్యే పేరు	పార్టీ
1952	కె.వెంకటశెట్టి	ఇండిపెండెంట్
1955	బీపీ శేషారెడ్డి	ఇండిపెండెంట్
1962	నీలం సంజీవరెడ్డి	కాంగ్రెస్
1965 (ఉప ఎన్నిక)	సి.రాంభూపాల్ రెడ్డి	కాంగ్రెస్
1967	కోట్రికే కృష్ణమూర్తి	స్వతంత్ర
1972	మేకల శేషన్న	కాంగ్రెస్
1978	కేఈ కృష్ణమూర్తి	కాంగ్రెస్ (ఐ)
1983	కేఈ కృష్ణమూర్తి	కాంగ్రెస్
1985	కేఈ కృష్ణమూర్తి	టీడీపీ
1989	కేఈ కృష్ణమూర్తి	కాంగ్రెస్
1994	కోట్ల విజయభాస్కర్‌రెడ్డి	కాంగ్రెస్
1996 (ఉప ఎన్నిక)	కేఈ ప్రభాకర్	టీడీపీ
1999	కేఈ ప్రభాకర్	టీడీపీ
2004	కోట్ల సుజాతమ	కాంగ్రెస్
2009	కేఈ కృష్ణమూర్తి	టీడీపీ
2014	బుగ్గనరాజేంద్రనాథ్ రెడ్డి	వైసీపీ
2019	బుగ్గనరాజేంద్రనాథ్ రెడ్డి	వైసీపీ



నీలం సంజీవరెడ్డి



కోట్ల విజయభాస్కర్ రెడ్డి



కేఈ కృష్ణమూర్తి

జనానికి జగన్ షాక్



- 200 శాతం విద్యుత్ చార్జీలను పెంచిన వైసీపీ ప్రభుత్వం
- పేద, మధ్య తరగతి ప్రజలు విలవిల



నంద్యాల రూరల్ ఏప్రిల్ 18 : విద్యుత్ చార్జీలతో జగన్ ప్రభుత్వం ఐదేళ్లుగా జనాన్ని బాదేసింది. గృహోపకరణాల్లో మార్పు లేకపోయినా విద్యుత్ బిల్లులు భారీగా పెరిగాయి. వైసీపీ తన పరిపాలనలో పలు మార్లు విద్యుత్ బిల్లులు పెంచింది. ట్రూఅప్ తదితర చార్జీల రూపేణ వినియోగదారులపై భారాన్ని మరింత పెంచింది. గతంలో విద్యుత్ బిల్లు రూ. 300 ఉంటే నేడు రూ. 600 పైగా వస్తోంది. పేద, మధ్యతరగతి ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది.

బిల్లులు చూస్తే భయమేస్తోంది:



పట్టణంలోని సౌజన్య కాంప్లెక్స్‌లో కళాంజలి ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాను. గత నెలలో రూ. 2వేలు వచ్చిన విద్యుత్ బిల్లు ఈ నెలలో రూ. 3100 వచ్చింది. ఈ విద్యుత్ భారం భరించలేక సోలార్ విద్యుత్ వాడాలని నిర్ణయించుకున్నా.

రమేష్, కళాంజలి ప్రింటింగ్ ప్రెస్

తాళం వేసినా బాదుడే బాదుడు

నంద్యాల పప్పుల బట్టీ బజార్‌లో మా ఇల్లు ఉంది. నెలరోజులుగా ఇంట్లో ఎవ్వరం లేకపోయినా కరెంట్ బిల్లు రూ. 450 వచ్చింది. ఏమిటో ఈ బాదుడు అర్థం కావడం లేదు.

- పుణ్యమూర్తి సంతోష్ కుమార్

గిరి పుత్రులపైనా బాదుడే...

గత ప్రభుత్వాలు గిరిజనులకు 200 యూనిట్ల వరకు రాయితీ ఇచ్చేవి. ఆపై యూనిట్లకు మాత్రమే గిరిజనులు విద్యుత్ బిల్లులు చెల్లించే వారు. కానీ వైసీపీ ప్రభుత్వం గిరిజనులు 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వాడితే మొత్తం బిల్లు వసూలు చేస్తోంది.

డిపాజిట్ గల్లంతు అంటే ఏంటి...?

తెలుసుకుందాం..

ఆదోని, ఏప్రిల్ 18: ఎన్నికల సమయంలో ప్రత్యర్థులకు డిపాజిట్ కూడా దక్కదనే మాటను తరచుగా వింటుంటాం. అయితే అసలు ఈ డిపాజిట్ అంటే ఏంటి..? డిపాజిట్ గల్లంతు అవడమంటే ఏమిటి..? దీనికి సంబంధించిన వివరాలను ఒకసారి పరిశీలిస్తే. భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో అనేక రకాల ఎన్నికలు జరుగుతాయి. అందువల్ల, వేర్వేరు ఎన్నికల్లో వేర్వేరు డిపాజిట్ ఉంటుంది. లోక్‌సభ లేదా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి నిర్దిష్ట మొత్తాన్ని ఎన్నికల సంఘం వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని సెక్యూరిటీ మొత్తం అంటారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 34,1 (ఏ) ప్రకారం సాధారణ అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రూ.25,000, అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల్లో పోటీ చేసేందుకు రూ.10,000 డిపాజిట్ చేయడం తప్పనిసరి. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 158 వివిధ ఎన్నికలలో అభ్యర్థుల సెక్యూరిటీ డిపాజిట్‌ను జప్తు చేయడం, తిరిగి ఇచ్చే పరిస్థితిని పేర్కొంటుంది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల్లో పోలైన మొత్తం ఓట్లలో 1/6 శాతం ఓట్లు రాకపోతే ఆ అభ్యర్థికి డిపాజిట్ గల్లంతు అవుతుంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు కూడా ఇదే ఫార్ములా వర్తిస్తుంది.

నేర చరిత విప్పాల్సిందే

నంద్యాల రూరల్, ఏప్రిల్ 18: సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో తమపై ఉన్న కేసుల వివరాలను ప్రజలకు తెలియజేయాలి. ఇందుకోసం ఫారం-26లో అఫిడవిట్‌ను విధిగా జతపరచడంతో పాటు సమాచార సాధనాలు, పత్రికల ద్వారా అభ్యర్థులు వివరించాల్సి ఉంటుంది. శుక్రవారం నుంచి జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లోనూ నామినేషన్ల స్వీకరణ కార్యక్రమానికి స్వీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు క్రిమినల్, పెండింగ్ కేసులకు సంబంధించిన వివరాల అఫిడవిట్‌తో నామినేషన్ అందజేయాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారులు ఆ అఫిడవిట్‌ను పరిశీలించిన తర్వాత నామినేషన్‌ను స్వీకరించనున్నారు. అఫిడవిట్‌లో సీ-1 ఫార్మెట్‌లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి సంబంధించిన పెండింగ్ క్రిమినల్ కేసులకు సంబంధించి అన్ని వివరాలను నియోజకవర్గ పరిధిలో ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా కనీసం మూడు సార్లు ప్రచురించాల్సి ఉంటుంది. పోటీ చేసే ప్రతి అభ్యర్థిపై క్రిమినల్ కేసులు ఉంటే వాటిని ప్రజలు తెలుసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తుందన్నారు. నగదు మద్యం సరఫరాను నియంత్రిచేందుకు అన్ని బృందాలు రంగంలో ఉన్నాయి.



సువిధ ద్వారానే ప్రచార అనుమతులు

పోటిచేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాన్ని కొనసాగించేందుకు ఎన్నికల అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అనుమతులు పొందడం కోసం ఈసారి ప్రత్యేకంగా రూపొందించిన సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రదర్శనలు, సభలు, సమావేశాలు, పార్టీ కార్యాలయ ఏర్పాటు, వాహనాల అనుమతులు, లౌడు స్పీకర్ల, అనుమతులన్నీ ఈయాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పొందాల్సి ఉంటుంది.

మైసూర్ నుంచి సిరా సరఫరా

నంద్యాల రూరల్, ఏప్రిల్ 18: ఓటు వేశారా అంటే నోటితో సమాధానం చెప్పనక్కర్లేదు. సిరా గుర్తును వేలును చూపిస్తే చాలు. సిరా చుక్కకు, ఓటుకు ఉన్న సంబంధం అలాంటిది ఓటేసే బాధ్యత కలిగిన పౌరునిగా సమాజంలో ఆ సిరా ఎక్కడ తయారవుతుందో తెలుసా. కర్ణాటకలోని మైసూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని రంగులను వార్నిష్ పరిశ్రమ తృత్తి చేస్తుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలకు ఇక్కడ నుంచే సిరా సరఫరా అవుతుంది. ఇది 29 దేశాలకు సరఫరా అవుతుంది. ఇతర వస్తువుల మాదిరిగా సిరాకు ఖరీదు కూడా పెరిగిపోయింది. 2019 ఎన్నికల్లో పోల్చితే ఓటర్ల సంఖ్య పెరిగింది. 1962 పార్వత్రిక ఎన్నికల నుంచి మైసూర్ పెయింట్స్ వార్నిష్ కర్మాగారం ఉత్పత్తి చేస్తున్న చెరిగిపోని సిరానే వినియోగిస్తున్నారు. ఈసారి కూడా అక్కడ నుంచే సిరాను సరఫరా చేయనున్నట్లు సమాచారం. 1937లో అప్పటి మైసూర్ మహరాజు నాల్మడి కృష్ణరాజ వడయార్ ఈసిరా తయారీ కర్మాగారాన్ని స్థాపించారు. అప్పటి దీని పేరు మైసూర్ లాక్ అండ్ పెయింట్ వర్క్స్. 1989లో దాని పేరును మైసూర్ పెయింట్స్ అండ్ వార్నీస్ సంస్థగా మార్చారు. స్వాతంత్ర్యానికి ముందు వరకు మైసూర్ రాజుల స్వాధీనంలో ఉండేది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ పరమైంది. తొలుత సీళ్ల వేసేందుకు కావాల్సిన లక్కా తయారీకి ఈ పరిశ్రమను స్థాపించారు. చెట్ల నుంచా వచ్చే జిగురు, తెచ్చి దానికి ఇతర అటవీ ఉత్పత్తులను కలిపి లక్కగా మార్చి రాజముద్రను వేసేందుకు ఉపయోగించే వారు. జిగురు సరఫరా తగ్గిపోవడంతో లక్కకు బదులుగా చెట్ల పసురు ఆధారంగా పెయింట్ల తయారీని ప్రారంభించారు. 1962లో ఒక ఓటరు పలుమార్లు ఓటు వేయకుండా నివారించేందుకు చెరిగిపోని సిరాను ఉత్పత్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. నేషనల్ ఫిజికల్ లాబోరేటరీస్ ఫార్ములాతో సిరా ఉత్పత్తి బాధ్యాతను ఈకర్మాగారానికి అప్పగించింది.



ఈ సిరా ఎందుకు చెరగదంటే..

మొదట్లో ఓటు వేసిన వ్యక్తికి ఎడమచేతి వేలిపై సిరా చుక్కను పెట్టేవారు. 2006 ఫిబ్రవరి నుంచి ఓటర్ల ఎడమ చేతి వేలి గోరుపై సిరాను గీతగా పెడుతున్నారు. సిరాలో 7-25శాతం సిల్వర్ నైట్రేట్ ఉన్నందున వెంటనే చెరిగిపోదు. ఈసిరా నేరేడు పండు రంగులో ఉంటుంది.

లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోల వివరాలు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 18: నంద్యాల జిల్లా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఆర్వోలను నియమించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు సంబంధిత ఆర్వోలను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. వారి వివరాలు ఇలా..

నియోజకవర్గం	ఆర్వో	నామినేషన్ల ఆఫీసు	సెల్ నంబరు
నంద్యాల (పార్లమెంట్)	కె.శ్రీనివాసులు	నంద్యాల కలెక్టరేట్	7337318567
నంద్యాల	టి.రాహుల్‌కుమార్ రెడ్డి	తహసీల్దారు ఆఫీసు	8522030888
శ్రీశైలం	కె.సుధారాణి	తహసీల్దారు ఆఫీసు	9989925007
నందికొట్కూరు	ఎం.దాసు	తహసీల్దారు ఆఫీసు	7815959529
బనగానపల్లె	ఎస్‌వీఎస్	తహసీల్దారు ఆఫీసు	8978882804
డోన్	బి.మహేశ్వరరెడ్డి	తహసీల్దారు ఆఫీసు	7815959530
ఆళ్లగడ్డ	వి.మల్లిఖార్జున రెడ్డి	తహసీల్దారు ఆఫీసు	8333989000

ఎవరి ఆస్తి ఎంత..

ఆత్మకూరు, ఏప్రిల్ 18: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులుగా గురువారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. అయితే వారి నామినేషన్ పత్రాల వెంట ఆస్తుల వివరాలతో కూడిన అఫిడవిట్లను సమర్పించారు. అందులో దంపతులకు సంబంధించిన ఆస్తిపాస్తులను వెల్లడించారు. ఆ వివరాలు ఇలా..

పేరు	చరాస్తులు	స్థిరాస్తులు	అప్పులు	బ్యాంక్ బ్యాలెన్స్
శిల్పా చక్రపాణిరెడ్డి	రూ.35,95,65,288	రూ.29,99,97,900	రూ.20,73,74,696	రూ.9,18,279
శిల్పా భాగ్యలక్ష్మి	రూ.11,97,84,866	రూ.28,05,22,900	రూ.7,50,40,048	రూ.94,887
బుడ్డా రాజశేఖరరెడ్డి	రూ.39,09,644	రూ.58,99,200	రూ.88,49,999	రూ.1,18,583
బుడ్డా శైలజ	రూ.96,32,854	రూ.1,61,17,000	-----	రూ.40,23,242

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

తహసీల్దార్ వెంకటరమణ బాధ్యతల స్వీకరణ



పాములపాడు, ఏప్రిల్ 18: పాములపాడు మండల తహసీల్దార్‌గా వెంకటరమణ గురువారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. తహసీల్దార్ మాట్లాడుతూ విజయవాడలో ఎండోమెంట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న తమను పాములపాడు తహసీల్దార్‌గా నియమించారని తెలిపారు.

'ఉపాధి కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి'

పగిడ్యాల, ఏప్రిల్ 18: ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న అధికారుల నిర్లక్ష్యంలోనే ఉపాధి కూలీ బొల్లెందుల ఏసేపు మృతి చెందారని, ఆయన కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పక్కీర్‌సాహెబ్ కోరారు. మండలంలోని పాతముచ్చుమర్రి గ్రామంలో మృతి చెందిన ఉపాధి కూలీ ఏసేపు మృతదేహంపై పూలమాలలు వేసి గురువారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈశ్వరమ్మ, ప్రసాద్, శివన్న, రాజు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

బైకు దగ్ధం

బండిఆత్మకూరు, ఏప్రిల్ 18: మండలంలోని ఎ.కోడూరు వద్ద గడ్డి లారీకి విద్యుత్ తీగలు తాకి మంటలు చెలరేగాయి. బుధవారం రాత్రి అనంతపురం జిల్లా నార్పల మండలానికి మండలంలోని ఏ కోడూరు నుంచి లారీలో గడ్డి చుట్టలు లోడ్ చేసుకుని వెళ్తుండగా విద్యుత్ తీగలు తాకి ప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఎ.కోడూరు గ్రామస్థులు డ్రైవర్‌ను గ్రామం వెలుపలకు వెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో మంటలు మరింత వ్యాపించి కాలుతున్న గడ్డి కట్టలు నంద్యాల, ఆత్మకూరు ప్రధాన రహదారి వెంట పడ్డాయి. ఎదురుగా నంద్యాల మండలం కొత్తపల్లె నుంచి హుస్సేన్ అనేవ్యక్తి భార్య, బిడ్డతో వెలుగోడు మండలం అబ్దుల్లాపురం వెళ్తుండగా, కాలుతున్న లారీ దాటే సమయంలో మోటార్ బైక్‌పై కాలుతున్న గడ్డి కట్ట పడింది. వారంతా బైక్ నుంచి కిందకు దూకారు. ప్రమాదంలో బైక్ కాలిపోయింది. మహిళకు కాలిన గాయాలు కావటంతో వెంటనే స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నంద్యాల అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పి వేశారు.

ఆత్మకూరులో భారీ అగ్ని ప్రమాదం

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 18: ఆత్మకూరు పట్టణంలోని రఘునాథ్ సెంటర్‌లో నర్సింగ్ భానసింగ్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న శివజ్యోతి ట్రేడర్స్‌కు చెందిన పాత ఇనుప సామాను అంగడిలో బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పాతసామాను, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, ఇనుప సామాను, పేపర్లు, అట్టలు కాలి బూడిదయ్యాయి. స్థానికులు గమనించి దుకాణ యజమానికి, అగ్ని మాపక శాఖకు సమాచారం అందించారు. అప్పటికే మంటలు చెలరేగడంతో ఆర్పడం కష్టమైంది. గురువారం మధ్యాహ్నానికి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు 20 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని భానుసింగ్ కోరాడు.

'వైసీపీ నిజస్వరూపం బయట పెడతా'

నంద్యాల రూరల్, ఏప్రిల్ 18: డేటా చోరీలో వైసీపీ నిజస్వరూపాన్ని బయటపెడతానని వైసీపీ సానుభూతి పరుడు కామినీ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం నంద్యాల అసెంబ్లీ స్వతం త్ర్య అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆయన మాట్లాడుతూ తాను గత పదేళ్లుగా వైసీపీ హార్డ్‌కోర్ అభిమానిని అని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నిజస్వరూపం తెలిసిందని అన్నారు. పవన్, లోకేష్‌లు కోరితే వారికి ఆధారాలు సమర్పిస్తానని, త్వరలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి డేటా చోరీలో వైసీపీ గుట్టు రట్టు చేస్తానని విష్ణువర్ధన్ రెడ్డి చెప్పారు.

'ఉద్యోగ అర్హతకు నైపుణ్యం అవసరం'

పాణ్యం, ఏప్రిల్ 18: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించ డానికి నైపుణ్యమే అర్హత అని విశాఖపట్నం టాలెంట్ షైన్ శిక్షణా సంస్థ శిక్షకులు ప్రొఫెసర్ రఫీ అన్నారు. మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ అంశంపై పది రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డీన్ డేవిడ్ సుకీర్తి కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోపిడీ యత్నం

మహానంది, ఏప్రిల్ 18: మండలంలోని తమ్మడపల్లె గ్రామ సమీపంలో వెళ్తున్న భక్తు లకు చెందిన కారును ఆగంత కులు వెంబడించారు. మహా నంది నుంచి తిరుపతి వెళ్తున్న భక్తుల కారును బుధవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించి కారు అద్దాలను ధ్వంసం చేశారు. చోరీకి పాల్పడుతున్న క్రమంలో వెనుక వైపు నుంచి మరో రెండు కార్లు రావడంతో దొంగలు పారి పోతుండగా యాత్రికులు పట్టు కున్నారు. దొంగలు మండలం లోని బొల్లవరం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు తెలి సింది. వీరిని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించేశారు.

అలరించిన హరికథ

శ్రీశైలం, ఏప్రిల్ 18: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహి స్తున్న నిత్య కళా రాధన కార్యక్రమంలో గురువారం హైదరాబాద్‌కు చెందిన నటరాజ ఆర్ట్స్ అకాడమీ బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తా

● ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఫైర్ ● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బుడ్డా ● భారీగా తరలివచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు



ఆత్మకూరులో మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖరరెడ్డి



భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు



టీడీపీలో చేరిన గిరిజనులు

ఆత్మకూరు, ఏప్రిల్ 18: దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తానని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై మండిపడ్డారు. గురువారం శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుడ్డా రాజశేఖరరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం గౌడ్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఎన్నికల ముందు సీఎం జగన్ 40 హామీలిస్తే చెప్తే ఎమ్మెల్యే శిల్పా 400 అబద్ధాల హామీలతో ఇక్కడి ప్రజలు మోగించాడని చెప్పారు. వరదరాజ స్వామి ప్రాజెక్ట్‌కు శ్రీశైలం జలాశయం నుంచి ఎత్తి పోతల పథకాన్ని ఏర్పాటు చేస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆనాడు తాను సిద్దాపురం ఎత్తిపోతలను పూర్తిచేయిస్తే కనీసం పంట కాలు వలను కూడా నిర్మించలేని స్థితిలో శిల్పా ఉన్నారని అన్నారు. వర్ధన్ బ్యాంకు పేరిట రూ.30కోట్ల దళితుల సొమ్మును కాజేశారని ఆరోపించారు. శ్రీశైలంలో కార్తీకేయ ఏజెన్సీ పేరిట నెలకు రూ.కోటిన్నర దోచుకుంటున్నారని, శ్రీశైలంలో టీకొట్టు నుంచి మరే ఏ ఇతర వ్యాపారం చేసుకోవాలన్న శిల్పాకు శిస్తు చెల్లించాల్సిన స్థితికి మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన, బీజేపీ అండతో శ్రీశైలంలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు.

ఇతర నాయకుల ప్రసంగాలు

మరోసారి ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డిని గెలిపిస్తే శ్రీశైలాన్ని శిల్పా వెంచర్‌గా మార్చేస్తారని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ఆరోపించారు. అనునిత్యం న్యాయం కోసం పోరాడే వ్యక్తి, ఎప్పుడు ప్రజల్లో ఉండే వ్యక్తి బుడ్డా రాజశేఖరరెడ్డి అని ఆయన గెలుపు కోసం మీరందరు పాటుపడాలని పిలుపునిచ్చారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఎవరో ప్రజలెవరికీ తెలియదని, అలాంటి వ్యక్తులను గెలిపిస్తే నష్టపోయేది ప్రజలేనని అన్నారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ బుడ్డా రాజశేఖరరెడ్డి గుండెలో రెండు స్టంట్లు వేశాడని, ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ ప్రాణాలకు తెగించి ప్రజాసేవ కోసం ఎన్నికల బరిలో నిలిచారని, ఆయన్ని మంచి మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. విద్యావంతురాలైన డాక్టర్ బైరెడ్డి శబరిని కూడా గెలిపించాలని ఆకాంక్షించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖరగౌడ్ మాట్లాడుతూ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే బుడ్డా విజయం ఖాయమన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా సతీమణి బుడ్డా శైలజమ్మ, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కలీముల్లా, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, జనసేన నాయకులు అశోక్, శ్రీరాములు, బీజేపీ నాయకులు సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరు పట్టణంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేసేందుకు బుడ్డా రాజశేఖరరెడ్డి కుటుంబసమేతంగా హాజరయ్యారు. ఈ ప్రక్రియ అనంతరం గౌడ్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బుడ్డా అనుచరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆత్మకూరు పట్టణంలోని పలు కాలనీల నుంచి ఆయా పార్టీల శ్రేణులు భారీగా తరలివచ్చారు. సుమారు 10వేలకు పైగా జనం తరలిరావడంతో గౌడ్‌సెంటర్ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల శ్రేణులతో కిక్కిరిసింది. అలాగే గౌడ్‌సెంటర్ చుట్టూ ఉన్న మిద్దెలపైకి జనం భారీగా చేరుకున్నారు. దారిపొడవునా డ్రమ్స్ వాయిద్యాలతో సంబరాలు జరిపారు. మండుటెండల్ని సైతం లెక్క చేయ కుండా మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: పెచ్చెరువు గూడేనికి చెందిన పులిచెర్ల వీరయ్య, ఆర్తి అంకన్న,దాసరి నాగన్న, రాముడు, నాగరాజు, అంకన్నతో పాటు సుమారు వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ గిరిజనులందరూ ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయం చేరుకుని బుడ్డారాజశేఖరరెడ్డిని కలుసుకుని టీడీపీలో చేరారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: గౌరు



గౌరు వెంకట్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



బూజనూరులో పథకాలపై అవగాహన కల్పిస్తున్న గౌరు

గడివేముల, ఏప్రిల్ 18: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో సంపద సృష్టిస్తే ఇప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ సంపద దోచుకుతిన్నారని, టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని బూజనూరు గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి లేదని, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఎడాపెడ కరెంట్ చార్జీలు, బస్సు చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో జగన్‌మోహన్‌రెడ్డి విఫలమయ్యారని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరు చరితకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలనికోరారు. టీడీపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, మునిశేషిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, ఎస్‌ఏ రఫిక్, కృష్ణయాదవ్, శ్రీనివాసయాదవ్, గని హర్ష, మాజీ సర్పంచ్ జమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

మండల కేంద్రంలో గురువారం నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి ఆ పార్టీ నాయకులు టీడీపీలో చేరారు. వైసీపీ నాయకులు గడివేముల మాజీ సర్పంచ్, జమాల్‌బాషా, మాజీ వైస్ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, షణ్ముకారెడ్డి, రమణారెడ్డి, చిన్న రంగడు, మహమ్మద్‌రఫి, మాసుం, వలి, బాబు, అబ్బాస్, రాముడు, మాబాషా, సూఫి, ఎక్స్ ఆర్మీ జమాల్‌బాషా, ఎల్లప్ప, తదితరులకు గౌరు వెంకట్‌రెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపుకు సైనికుల్లా కృషి చేయాలని అన్నారు. మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, గని హర్ష, నారాయణరెడ్డి, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

టీడీపీ వస్తే యువతకు ఉద్యోగావకాశాలు: శబరి



పెద్దగుమ్మడాపురంలో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

కొత్తపల్లి, ఏప్రిల్ 18: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరి అన్నారు. చిన్నగుమ్మడాపురం, పెద్ద గుమ్మడాపురం, సింగరాజుపల్లి గ్రామాల్లో శబరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ కూడా తాగునీరు లేదా కానీ.. గంజాయి, నాటుసారా మాత్రం విచ్చలవిడిగా దొరుకుతుందని ఆరోపించారు. యువతకు ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని హామీ ఇచ్చి సీఎం జగన్ యువత భవిష్యత్తును నాశనం చేశారని ధ్వజమెత్తారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్‌ను ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులకు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా జగన్ అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం కనీసం రోడ్ల మరమ్మతుల పనులు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఒక సైకోకు అధికారం ఇచ్చి తప్పు చేశామని ప్రజలు బాధ పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, నాయకులు ఏఎస్ రాజు, నాగ శేషన్న, గంగన్న, శంకర్‌రావు, శ్రీనివాస నాయక్, బుచ్చిరెడ్డి, తిమ్మారెడ్డి, రవి, భాస్కర్, హుశేనయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ కుటుంబ సభ్యులపై ప్రజల ఆగ్రహం

● ప్రభుత్వ బోరు నీటిని అమ్ముకుంటున్నారని ఆరోపణ
● ప్రశ్నించిన స్థానికులు.. ఫీజులు తీసుకెళ్లిన మున్సిపల్ అధికారులు
● తాగునీటి సమస్యతో ప్రజల అవస్థలు



నీటి కోసం వాహనాన్ని తీసుకొచ్చిన కౌన్సిలర్ కుటుంబ సభ్యులు

నందికొట్కూరు, ఏప్రిల్ 18: నందికొట్కూరులో ప్రభుత్వ బోరు నీటిని అమ్ముకోవడానికి కూడా వెనుకాడడం లేదని వైసీపీ కౌన్సిలర్ కుటుంబంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నందికొట్కూరు పట్టణంలోని 5వ వార్డు కౌన్సిలర్ షేక్ రేష్మా కుటుంబ సభ్యులు ప్రభుత్వ బోరు నుంచి వచ్చే నీటిని కూడా వదలడం లేదని వాపోతున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉన్న మున్సిపాల్టీ బోరు నుంచి నీటిని ట్యాంకర్ ద్వారా సేకరించి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఆత్మకూరు రోడ్డులో ఉన్న మున్సిపల్ బోరు వద్ద నుంచి పైప్ ద్వారా వాహనంలో 500 లీటర్ల ట్యాంకర్‌ను నింపుకుంటున్నారు. రాత్రింబవళ్లు ఆ వాహనం ద్వారా ప్రభుత్వ నీటిని కొల్లగొడుతున్నారు. అయితే స్థానిక మహిళలు నీళ్లు పట్టుకోవడానికి అక్కడికి వస్తే... కౌన్సిలర్ కుటుంబ సభ్యులు అడ్డుచెప్పారు. తాము నీళ్లు పట్టుకోవడానికి వస్తే ఊడ్డు చెప్పడం ఏమిటని స్థానికులు కౌన్సిలర్ కుటుంబ సభ్యులను నిలదీశారు. స్థానికులు మున్సిపల్ డీఈ నయాబ్ రసూల్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ డీఈ సిబ్బందిని అక్కడికి పంపించి మోటారుకు ఉన్న ఫీజులను తీసుకెళ్లారు. నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు డీఈకి ఫోన్ చేయగా సంఘటన స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. సమస్యను తెలుసుకొని వెంటనే ఫీజులను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎవరైనా ఇలాంటి చర్యలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

వైసీపీని ఇంటికి సాగనంపుదాం: మాండ్ర



టీడీపీలో చేరిన పెద్దగుమ్మడాపురం వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 18: వైసీపీని ఇక ఇంటికి సాగనంపుదామని, రాక్షస పాలన నుంచి విముక్తి పొందేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నంద్యాల టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. గురువారం అల్లూరు గ్రామంలో మాండ్ర సమక్షంలో కొత్తపల్లె మండలం పెద్దగుమ్మడాపురం గ్రామ వైసీపీ నాయకులు కొత్తపల్లె మండల టీడీపీ కన్వీనర్ నారపురెడ్డి, మల్లయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. టీడీపీ లో చేరిన వారికి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మల్లయ్య, మశన్న, సుబ్బరాయుడు, కృష్ణ, వెంకటేష్, శంకరయ్య, రామణయ్య, భారతీయుడు తదితరులు ఉన్నారు. మాండ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనతో అన్నివర్గాల ప్రజలు విసిగి పోయారని, ఓటుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు తరలిన నాయకులు

మహానంది, ఏప్రిల్ 18: శ్రీశైలం నియోజకవర్గంలోని మహానంది మండలం నుంచి వేలమంది తెలుగు తమ్ముళ్లు ప్రత్యేక వాహనాలలో గురువారం ఆత్మకూరుకు తరలి వెళ్లారు. నియోజకవర్గం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నామినేషన్ కార్యక్రమానికి వెళ్లారు. మండంలోని మహానంది, బుక్కాపురం, మసీదుపురం, గాజులపల్లె, తిమ్మాపురం, బొల్లవరం, గోపవరం నందిపల్లె గ్రామాలనుండి వేలాదిమంది టీడీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో వాహనాల ద్వారా తరలివెళ్లారు. మసీదుపురం మౌళీశ్వరరెడ్డి, సూరె శ్రీనివాసులు, క్రాంతి కుమార్, కంచెర్ల శివ, అస్లాంబాష, కిరాలి వెంకటేశ్వర్లు, మహేశ్వరరెడ్డి వున్నారు.

బండిఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి బండిఆత్మకూరు మండలం నుంచి తెలుగుతమ్ముళ్ళు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. గురువారం ఉదయం 11 గంటల నుంచే పలు వాహనాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ స్థాయి నాయకుల ఆధ్వర్యాన ఆత్మకూరుకు బయలుదేరారు. అక్కడ బుడ్డా నామినేషన్ కార్యక్రమంలో, బహిరంగ సమావేశంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, మనోహర్‌చౌదరి, డాక్టర్ భరద్వాజశర్మ, బుగ్గరాముడు, కృష్ణారెడ్డి, రామచంద్రుడు, తిరుపాల్, శీను పాల్గొన్నారు.

వెలుగోడు: టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు పలు వాహనాలలో ఆత్మకూరుకు తరలి వెళ్లారు. మండు టెండలను సైతం లెక్క చేయక తమ అభిమాన నేత నామినేషన్ కొరకు ఉత్సాహంతో తరలి వెళ్లారు. వెలుగోడు మీదుగా బండి ఆత్మకూరు మహానందికి చెందిన వాహనాలు భారీగా తరలి వెళ్ళడంతో వెలుగోడు ప్రధాన రహదారి వాహన రాకపోకలతో కిటకిట లాడింది.

రాక్షస పాలనకు అంతం పలకాలి: జయసూర్య



ప్రచారం నిర్వహిస్తున్నటీడీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 18: రాక్షస పాలనకు అంతం పలకాలని టీడీపీ నాయకులు గౌరు మురళీధర్‌రెడ్డి, మాండ్ర లింగారెడ్డి, నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి జయసూర్య పిలుపునిచ్చారు. బ్రాహ్మణ కొట్కూరులో ఎన్నికల శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి గ్రామస్థులకు వివరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. టీడీపీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు.

గుంతలమయంగా గుమ్మడాపురం రహదారి

● ఇబ్బందులు పడుతున్నగ్రామస్థులు



గుంతలమయంగా మారిన గుమ్మడాపురం రహదారి

కొత్తపల్లి, ఏప్రిల్ 18: గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు గుంతలమయమైనా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని పెద్దగుమ్మడాపురం ప్రధాన రహదారిని సుమారు పదేళ్ల క్రితం పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో బీటీ రోడ్డు రహదారిని నిర్మించారు. గత మూడేళ్లుగా పూర్తిగా గుంతలమయమై ద్విచక్రవాహనదారులు, ఆటో డ్రైవర్లు, ఈ రహదారి గుండా గ్రామాలకు వెళ్లాలంటే భయాందోళనలకు గురవుతున్నారు. సంగమేశ్వరం వెళ్లే ప్రధాన రహదారుల నుంచి గుమ్మడాపురంకు కేవలం 2 కిలోమీటర్లు మాత్రమే ఉంది. ఈ రోడ్డు గూండా నిత్యం గ్రామస్థులు సచివాలయ అధికారులు, సిబ్బంది ఆత్మకూరు పట్టణానికి వివిధ పనుల నిమ్మితం వెళ్తా వస్తుంటారు. ఈ రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ద్విచక్రవాహనదారులు రాత్రివేళలో కింద పడి గాయాలైన ఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



గుమ్మడాపురం రహదారి పూర్తిగా పాడైంది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. గ్రామం నుంచి బయటి ప్రాంతాలకు వెళ్లాలన్నా.. అక్కడి నుంచి గ్రామాలకు రావాలన్నా ఇదొక్కటే ప్రధాన రహదారి కావడంతో నిత్యం గ్రామస్థులు వివిధ ప్రాంతాలకు పనుల నిమ్మితం వెళ్లి వస్తు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- నాగేషన్న, టీడీపీ నాయకుడు, గుమ్మడాపురం

మరమ్మతులైనా చేపట్టాలి



గుమ్మడాపురం గ్రామంలో సుమారు రెండువేల మంది జనాభా ఉన్నారు. ప్రతి రోజు ఏదో పని నిమిత్తం వందల సంఖ్యలో వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే.. రహదారి దెబ్బతినడంతో ద్విచక్రవాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామానికి ఆటోడ్రైవర్లు రావాలంటే జంకుతున్నారు. దీంతో అధికారులు ప్రధాన రహదారికి కనీసం మరమ్మతులనైనా చేపట్టాలి.

- శ్రీనివాసనాయక్, టీడీపీ నాయకులు, గుమ్మడాపురం

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఫరూక్

గోస్పాడు, ఏప్రిల్ 18: గోస్పాడు మండలం కానాలపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వీరభద్రుడు, భార్య, కూతురుపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దాడి చేశారు. వీరభద్రుడు భార్యకు తీవ్ర గాయాలు కావడంతో నంద్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. గోస్పాడు మండల టీడీపీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, గోవిందరెడ్డి, జిన్నా శ్రీనివాసరెడ్డి, ఓబుల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

నామినేషన్ కేంద్రం తనిఖీ



నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు

నంద్యాల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ కార్యాలయాన్ని గురువారం ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకుడు కిరణ్ తొట్టుపురం అసోకన్ తనిఖీ చేశారు. అభ్యర్థుల వ్యయం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఇందుకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆర్వో మల్లికార్జునరెడ్డిని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చేసే ఖర్చులను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంటు ఆర్వో నజీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు: ఆళ్లగడ్డ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ కేంద్రం(తహసీల్దార్ కార్యాలయం) వద్ద పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆ ప్రాంతంలో ఎవరూ తిరగ కుండా ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ పర్యవేక్షణలో భద్రతా చర్యలు చేపట్టారు.

వైసీపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధం

నంద్యాల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎన్నికల పరిశీలకుడు కేవీ సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి అఖిలప్రియ, నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి గెలుపు తథ్యమని అన్నారు. టీడీపీ అభ్యర్థుల విజయం కోసం జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వైసీపీ నాయకులు అవినీతి పాల్పడ్డారని, అక్రంగా ధనాన్ని సంపాదించుకున్నారని ఆరోపించారు. ప్రజలంతా వైసీపీ నాయకుల ఆగడాలను, అవినీతిని గమనించారని, ఆ పార్టీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

'వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం'

నంద్యాల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని, వచ్చే ఎన్నికల్లో ఆళ్లగడ్డ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి అఖిలప్రియ, నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరిలను గెలిపిస్తే వారితో సేవలు చేయిస్తామని జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో గురువారం జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం ఇరిగెల రాంపుల్లారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో జరిగింది. వారు మాట్లాడుతూ ఐదేళ్లలో వైసీపీ ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను గాలికి వదిలేసి ఆస్తులు పెంచుకోవడానికి కృషి చేసుకున్నారని ఆరోపించారు. అనంతరం మాజీ మంత్రి అఖిలప్రియ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మాట్లాడుతూ నంద్యాల ప్రాంత అభివృద్ధికి, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేసేందుకు, ప్రజా సమస్యలపై అవగాహన ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఇరిగెల సోదరులు రామచంద్రారెడ్డి, విశ్వనాథరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ప్రతాపరెడ్డి, చింతకుంట శ్రీనివాసరెడ్డి(వాసు) టీడీపీ ఎన్నికల పరిశీలకుడు కేవీ సుబ్బారెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట్ల కుటుంబాన్ని విమర్శించే అర్హత బుగ్గనకు లేదు

డోన్, ఏప్రిల్ 18: కోట్ల కుటుంబాన్ని విమర్శించే అర్హత మంత్రి బుగ్గనకు లేదని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ హితవు పలికారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఓటమి భయంతో కోట్ల కుటుంబంపై ఇష్టానుసారంగా నోరు పారేసుకుండటం ప్రజలు గమనిస్తున్నారన్నారు. కోట్ల, కేఈ కుటుంబాలు రాజకీయంగా పోరాడారే తప్ప.. ఫ్యాక్షన్‌ను ఎన్నడూ ప్రోత్సహించ లేదన్నారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ శాశ్వతమైన అభివృద్ధి పనులు చేసిందన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, రంజిత్ కిరణ్, ఎస్ఎండీ రఫి, బీజేపీ నాయకుడు వడ్డె మహా రాజ్, జనసేన నాయకుడు ఆలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

'వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి'

చాగలమర్రి, ఏప్రిల్ 18: రాష్ట్రంలో వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముత్యాలపాడులో మాజీ ఎంపీపీ మస్తాన్, మాజీ సర్పంచ్ స్వప్నల ఆధ్వర్యంలో 50 కుటుంబాలు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, భార్గవ్‌రామ్‌ల సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారు మాట్లాడుతూ టీడీపీలో చేరుతున్న వారందరికి అండగా ఉంటామన్నారు. నాయకులు నరసింహారెడ్డి, అన్సర్‌బాషా, నాగరాజు, లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

చల్లా కోటలో బీటలు

- కొండమనాయినిపల్లెలో మాజీ ఎమ్మెల్యే బీసీ పాగా
- వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాయకులు

బనగానపల్లె, ఏప్రిల్ 18: చల్లా కంచు కోటగా పేరున్న గ్రామాల్లో వైసీపీకి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి భారీ షాక్ ఇచ్చారు. అవుకు మండలంలోని కొండమనాయినిపల్లె గ్రామంలో మొదటి నుంచి చల్లా కుటుంబానికి పట్టు ఉండేది. ఆ గ్రామానికి చెందిన వైసీపీ కీలక నేతలు బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరి ఆ పార్టీకి ఝలక్ ఇచ్చారు. టీడీపీ సీనియర్ నాయకులు ఐవీ పక్కీరారెడ్డి ఆధ్వర్యంలో కొండమనాయినిపల్లె గ్రామానికి చెందిన ఏవీ నాగిరెడ్డి, వై. శివారెడ్డి, బాల పెద్దిరాజు, సంజన్న, బోయ సుంకన్న, సోమ్లా నాయక్, హనుమానాయక్, సుబ్బరాయుడు, నాయక్, కుళాయి తదితర కీలక వైసీపీ నాయకులు, కార్యకర్తలు వారి కుటుంబాలతో సహ బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ బీసీ జనార్దన్‌రెడ్డి కండువాలు కప్పి టీడీపీలో ఆహ్వానించారు.

● **టీడీపీలో చేరిన చెరువుపల్లె వాసులు :** చెరువుపల్లె గ్రామానికి చెందిన వైసీపీ కీలక నాయకులు మధుమోహన్, ప్రభాస్, రంగస్వామి, శంకరయ్య, మహేంద్ర, వెంకటేశ్వర్లు, మనోహర్, తిమ్మయ్య, మద్దిలేటిస్వామి, చుక్కా రమేష్, చెవుల విజయుడు తదితర మొత్తం 40 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

● కోవెలకుంట్ల మండలం బిజనవేముల గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం భక్త ప్రహ్లాదరెడ్డి వైసీపీకి(షాక్ ఇచ్చారు. గురువారం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో ఆయన టీడీపీలో చేరారు.



బీసీ సమక్షంలో టీడీపీలో చేరిన కొలిమిగుండ్ల వాసులు

బీసీకి మద్దతుగా టీడీపీలో చేరిన కొలిమిగుండ్ల వాసులు: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డికి మద్దతుగా కొలిమిగుండ్ల వాసులు పలువురు టీడీపీలో చేరారు. గురువారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో కొలిమిగుండ్లకు చెందిన రిటైర్డ్ వీఆర్ఓ రంగస్వామి, కదిరి నర్సిరెడ్డి, రంగస్వామి(యర్రన్న), రంగస్వామి అలియస్ నల్లన్న, సూర్యనారాయణరెడ్డి, సాంబయ్య, నరసింహుడు, శ్రీకాంత్‌రెడ్డి, రవి కుమార్, రాజేష్, రఘు, తలారి రంగస్వామి, కుమార్, మధు, మద్దిలేటి, గుర్రప్ప, చరణ్, పెద్దయ్య, ఓబన్న, ఓబులేసు, అంబన్న గారి ఓబన్న, తదితర 30 కుటుంబాలు టీడీపీలో చేరారు.

బీసీకి మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులు: మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి కొలిమిగుండ్ల మండల ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిన వైఎస్ జగన్‌కు 2024 ఎన్నికల్లో తగినబుద్ధి చెబుతామన్నారు.

బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరిక: బనగానపల్లె టీడీపీ కార్యాల యంలో గురువారం కొలిమిగుండ్లకు చెందిన పలువురు మహిళలు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీసీ గెలుపు లక్ష్యంగా పని చేయాలి'

అవుకు: బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. గురువారం ప్రజా గళం కార్యక్రమంలో భాగంగా అవుకు మండలం కాశీపురం గ్రామానికి చేరుకున్న బీసీ ఇందిరమ్మకు గ్రామ సర్పంచ్ మొట్ల లావణ్య, ఎంపీటీసీ రాధమ్మ, నాయకులు మొట్ల రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటిం టికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఇప్పటివరకు అనుసరించిన విధానాలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకురావడం లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొట్ల ప్రతాప్‌రెడ్డి, మనోహ ర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వీర ప్రతాప్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రవీంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి': చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి కుమార్తె బీసీ మనోరమరెడ్డి అన్నారు. గురువారం అవుకు మండలం చనుగొండ్ల గ్రామంలో ప్రజాగళంలో భాగంగా ఆమె ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ కరపత్రాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వల్లపురెడ్డి మోహన్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, భైరెడ్డి చెన్నకేశవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, దూదెకుల మస్తాన్‌వలి, నారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, ఉశేన్‌పీరా, అల్లాబకాష్ పాల్గొన్నారు.



బీసీ సమక్షంలో టీడీపీలో చేరిన కొండమనాయినిపల్లె వైసీపీ నాయకులు



బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన చెరువుపల్లె వాసులు

'కార్యకర్తలే టీడీపీకి బలం'

కొలిమిగుండ్ల రూరల్: కింది స్థాయి కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి కుమార్తె బీసీ మనోరమ అన్నారు. గురువారం కొలిమిగుండ్ల టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, పులి ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డిలతో కలిసి బీసీ మనోరమ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు పెట్నికోట హుస్సేన్‌రెడ్డి, కార్యదర్శి ప్రసాదు, కామిని క్రిష్ణరంగారెడ్డి, భాస్కరరెడ్డి, అందెరాము, కొటపాడు శివరామిరెడ్డి, రవి ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

శివశంకర్‌రెడ్డితో బీసీ భేటీ

సంజామల: గిద్దలూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ బీఎంహెచ్ఓ డాక్టర్ శివశంకర్ రెడ్డితో గురువారం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి భేటి అయ్యారు. బీసీ వెంటే తన అనుచరులు ఉంటారని శివశంకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కానాల కేశవరెడ్డి, తులసిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాయలూరి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి: సీపీఐ

డోన్(రూరల్), ఏప్రిల్ 18: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓటు ద్వారా గద్దె దింపాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి ప్రత్యేక హోదాను సాధిస్తామని ప్రగల్బాలు పలికి.. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్ల పాలనలో వాటి ఊసెత్తలేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా, భూమాఫియా, డ్రగ్స్ మాఫియా నడుస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, సుంకయ్య, ఏపీ గిరిజన సమైఖ్య జిల్లా నాయకులు మోటరాముడు, సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, పట్టణ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

డోన్(రూరల్), ఏప్రిల్ 18: ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక శాఖాధికారి రంగస్వామి గౌడు అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీసుధ పాఠశాలలో విద్యార్థులకు ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ప్రాక్టికల్‌గా తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

డోన్(రూరల్), ఏప్రిల్ 18: మండలంలోని కమలాపురం, గోసానిపల్లె, సోంపురం, చిన్నమల్కాపురం, కొచ్చెర్వు గ్రామాల్లోని రాములోరి ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణం అనంతరం భక్తులు స్వామివారికి చదివింపులు చదివించారు. ఆలయ సన్నిధానాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీడీపీ విజయానికి కృషి చేద్దాం

సంజామల, ఏప్రిల్ 18: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేద్దామని పెండేకంటి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం గ్రామంలోని సాలెపేట, ముస్లింపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మల్కి ఉశేని, పెద్ద పుల్లయ్య, పాల రఘు, మాధవ, రవి, సుధాకర్, హజరత్, యుసుఫ్‌బేగ్, రామకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

నంద్యాల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె గ్రామ వైసీపీ సర్పంచ్ అంబటి లక్ష్మీదేవి, ఆమె భర్త నాగమద్దిలేటిరెడ్డిలతో పాటు 50 కుటుంబాలు జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి సమక్షంలో జనసేనలో చేరాయి.

యువకుడి ఆత్మహత్య

బేతంచెర్ల, ఏప్రిల్ 18: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన హుశేన్ వలి(20) అనారోగ్యంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలివి.. సంజీవనగర్ కాలనీకి చెందిన పెద్ద హుశేన్, షేకూన్‌బీ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో చిన్న కుమారుడు హుశేన్‌వలి పట్టణంలోని పాతబస్టాండులో ఒక ఎలక్ట్రా నిక్ షాపులో పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో వాళ్లు ఫోన్ చేస్తే స్పందించలేదని అనుమానం వచ్చి రోడ్డుపక్కన ఉన్న ఇంటికి వెళ్లి చూడగా.. దానికి ఉరి వేసుకుని కనిపించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని యువకుడి ఆత్మహత్యకు గల కారాణాలు తెలుసుకున్నారు.

వెండి వస్తువులు చోరీ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 18: పట్టణంలోని గడ్డ వీధిలో ఒకటిన్నర కేజీల వెండి వస్తువులు చోరీ జరిగినట్లు ఎస్ఐ వరప్రసాదు గురువారం తెలిపారు. ఎస్ఐ వరప్రసాద్ వివరాల మేరకు గత నెల 23న రాత్రి గడ్డ వీధిలోని ముక్కమల్ల పెద్దిరెడ్డి ఇంటికి తాళం వేసి, ఇంటి మేడపైన పడుకొని నిద్రించారు. అయితే ఉదయం లేచి చూడగా గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని ఒకటిన్నర కేజీల వెండి వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు గురువారం ఫిర్యాదు చేశారని, ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిలిచిన అవుకు రిజర్వాయర్ నీటి సరఫరా

గ్రామాల్లో తాగునీటి కష్టాలు



అవుకు రిజర్వాయర్ నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన సంప్

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 18: అవుకు రిజర్వాయర్ నుంచి సీపీడబ్ల్యూ స్కీమ్ ద్వారా గ్రామాలకు తాగునీటి సరఫరా 5రోజులుగా నిలిచిపోయింది. కొలిమిగుండ్ల మండలంలోని 15 గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే నిమిత్తం అవుకు రిజర్వాయర్ నుంచి సీపీడబ్ల్యూ ద్వారా పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అయితే ప్రధానంగా మండలంలోని మీర్జాపురం, కొలిమిగుండ్ల, నందిపాడు, తిమ్మనాయినిపేట, బెలుం, అవుకు మండలంలోని రామాపురం, చెర్లోపల్లె గ్రామాలకు తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో కొనసాగుతోంది. అయితే ఐదు రోజులుగా నీటి సరఫరా నిలిచి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. అవుకు రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గి పోవడంతో నీటి సరఫరా కోసం రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన మోటార్లకు నీరు అందడం లేదు. దీంతో నీటి సరఫరా నిలిచి పోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రిజర్వాయర్లో మోటార్లను మరింత లోపలికి దించి, నీటి సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు పేర్కొంటున్నా అది నేటికి అమలుకు నోచుకోలేదు. దీంతో అందుబాటులో వున్న అరకొర నీటి సరఫరాతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి అవుకు రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

54 మంది వలంటీర్లు రాజీనామా

కోవెలకుంట్ల, ఏప్రిల్ 18: మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 54 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ సయ్యదున్నిసా గురువారం తెలిపారు. బిజనవేముల సచివాలయంలో పని చేస్తున్న 12 మంది, రేవనూరు సచివాలయంలో పని చేస్తున్న 8 మంది, కోవెలకుంట్ల పట్ట ణంలోని 5 సచివాలయాల్లో పని చేస్తున్న 34 మంది మొత్తం 54 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా పత్రాలు సమర్పించినట్లు ఆమె తెలిపారు.

'టీడీపీతోనే అభివృద్ధి'

చాగలమర్రి, ఏప్రిల్ 18: రాష్ట్రంలో టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు జెట్టి నాగరాజు అన్నారు. గురువారం చాగలమర్రిలోని న్యూ బిల్డింగ్స్ వీధిలో టీడీపీ నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్-6 పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు అబ్దుల్ ఖాదర్, జెట్టి కుమార్, జోసఫ్, వెంకటయ్య, గాంధీ పాల్గొన్నారు.

'వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి'


చాగలమర్రి, ఏప్రిల్ 18: గ్రామాల్లో ప్రజలు వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు ఇమ్రాన్ సూచించారు. రోజు రోజుకు ఎండలు అధికం కావడంతో పిల్లలు, పెద్దలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అధిక భాగం నీడనిచ్చే ప్రదేశాల్లో ఉండాలని అన్నారు. వడదెబ్బ సోకిన వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోవాలని సూచించారు.

పాఠశాల తనిఖీ: మండలంలోని రాంపల్లె ప్రాథమిక పాఠశాలను ఎంఈవో న్యామతుల్ల గురువారం తనిఖీ చేశారు. ఎఫ్ఏ-2 పరీక్షలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'

నంద్యాల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియను ఆదరించాలని ఆమె మేనమామ ఎస్వీప్రసాదరెడ్డి కోరారు. ఆళ్లగడ్డ పట్టణంలోని 163వ బూత్ ఎస్వీ నగర్‌లో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రామాచారి, గోపాల్ తదితరులు ఉన్నారు.

వైసీపీకి పతనం తప్పదు: అఖిలప్రియ



కోటపాడులో టీడీపీలో చేరిన వారితో అఖిలప్రియ

ఆళ్లగడ్డ/ శిరివెళ్ల/ ఉయ్యాలవాడ, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి పతనం తప్పదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు రామిరెడ్డిగారి ఓబుళకొండారెడ్డి, అనంతమ్మతోపాటు పలు కుటుంబాలు అఖిలప్రియ సమక్షంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరాయి.

● ఆళ్లగడ్డ మండలం మర్రిపల్లె గ్రామ ఉప సర్పంచ్ సానె శివ టీడీపీ నాయకుడు పాపిరెడ్డి ఆధ్వర్యంలో అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా హరివరంలో అఖిలప్రియ ప్రచారం నిర్వహించారు.

చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభం



బేతంచెర్ల, ఏప్రిల్ 18: పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో వెలసిన చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 21 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం రాత్రి 12 గంటలకు గ్రామ దేవత సుంకులమ్మ, గుడి దగ్గర నుంచి జ్యోతి ఉత్సవాలు ప్రారంభించి వీధుల గుండా ఊరేగించారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

డోన్, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం డోన్ అసెంబ్లీ నియోజకవర్గం 141కి సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి నోటిఫికేషన్‌ను విడుదల చేసి వివరాలు వెల్లడించారు. డోన్ ఆర్డీవో కార్యాలయంలో ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని అన్నారు. ఈనెల 26న స్క్రూటినీ, 27 నుంచి 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, అసెంబ్లీకి నామినేషన్లు వేసే అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్లు వేసే అభ్యర్థితో కలిపి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.

తొలి రోజు నామినేషన్లు నిల్

డోన్, ఏప్రిల్ 18: డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి తొలిరోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. గురువారం ఎన్నికల సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు.

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు తెలిపారు. అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాటు చేశామన్నారు.


'నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 18: గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ మహీంధర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించటం తగదన్నారు. నీటి సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. అలాగే ఇంటి పన్ను విషయంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. మండలంలో రూ.11 లక్షల పైబడి డిమాండ్ టార్గెట్ కాగా ఇప్పటి వరకు కేవలం 60 శాతం మాత్రమే పూర్తి చేశారని తెలిపారు. మరో ఐదు రోజుల్లో వందశాతం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామా పంచాయతీ ప్రణాళికల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, వాటి సరిచేసుకోవాలి సూచించారు. గ్రామ పంచాయతీ ప్రణాళికలు ఎలా తయారు చేయాలి అన్న దానిపై డీఆర్పీలతో శిక్షణ ఇప్పించారు. కార్యక్రమంలో డీఆర్పీలు బాలాంజనేయులు, శేషన్న, దస్తగిరిబాషా, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లికి బాలుడి అప్పగింత

శిరివెళ్ల, ఏప్రిల్ 18 : గ్రామంలోని బలిజపేటలో తప్పిపోయి కనిపించిన ఓ బాలుడిని స్థానికులు గుర్తించి శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. నంద్యాల మండలం చాబోలుకు చెందిన ప్రసన్న తన కుమారుడు వరుణ్‌తో శిరివెళ్లలోని చాకలిపేటలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటూ బలిజపేటలోకి వెళ్లిపోయాడు. అనంతరం ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో విచారణ నిర్వహించి తల్లి ప్రసన్నను స్టేషన్‌కు పిలిపించి గురువారం బాలుడిని అప్పగించారు. తన కుమారుడిని క్షేమంగా అప్పగించిన పోలీసులకు ఆ తల్లి కృతజ్ఞతలు తెలియజేశారు.

గజదొంగలంతా కలిసి దోచేశారు: కోట్ల సుజాతమ్మ



టీడీపీలో చేరిన వారితో కోట్ల సుజాతమ్మ

డోన్, ఏప్రిల్ 18: వైసీపీ ప్రభుత్వంలో గజదొంగలంతా ముఠాగా ఏర్పడి ఇష్టారాజ్యంగా ప్రజలను దోచేశారని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. గురువారం మండలంలోని బి.రామదుర్గం గ్రామంలో వైసీపీకి చెందిన నాయ డు, పుల్లన్న, గోపాల్‌తో పాటు మరో 20 కుటుంబాలు కోట్ల సుజాతమ్మ సమక్షం లో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, గంధం శ్రీనివాసులు, శ్రీనివాసులు యాదవ్, మల్లికార్జున పాల్గొన్నారు.


టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్యాపిలి: సార్వత్రిక ఎన్నికల్లో డోన్‌లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన బూత్‌కమిటీ సభ్యుల సమా వేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ విబేధాలు పక్కన పెట్టి అందరూ కలసి కట్టుగా పనిచేయాలని సూచించారు. అనంతరం పట్టణానికి చెందిన మాజీ ఉప సర్పంచు పామిడి నాగన్నకు చెందిన కుటుంబీకులు, బంధువులు టీడీపీలో చేరారు. నాయకులు గండికోట రామసుబ్బయ్య, టి శ్రీనివాసులు, రామ్మోహన్‌యాదవ్, రాజానారాయణమూర్తి, ఆర్ఈ నాగరాజు పాల్గొన్నారు.

రైతులకు రూ.2.34 కోట్ల కుచ్చుటోపి

చాగలమర్రి, ఏప్రిల్ 18: మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన ఓ వ్యాపారి మినుములు, మొక్కజొన్నల వ్యాపారం చేస్తూ చుట్టుపక్కల గ్రామాల రైతుల నుంచి రూ.2.34 కోట్లు విలువైన ధాన్యం కొనుగోలు చేసి ఊరు వదిలి పారిపోయాడు. తమకు డబ్బులు ఇవ్వకుండా రెండు నెలల కింద తల్లిదండ్రులతో కలిసి గ్రామాన్ని వదిలి వెళ్లినట్లు రైతులు వాపోతున్నారు. దీంతో కొందరు రైతులు సదరు వ్యాపారి కుటుంబ సభ్యుల చిత్రాలను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. తమకు న్యాయం చేయాలని, మోసం చేసిన వ్యాపారి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు



శిరివెళ్లలో అడుగంటిన ఆనకట్ట కుంట

శిరివెళ్ల, ఏప్రిల్ 18: శిరివెళ్లలోని ఆనకట్ట కుంటలో నీళ్లు అడుగంటాయి. దీంతో గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేట్ బోర్లలో సైతం భూగర్భ జలాలు అడుగంటి నీళ్లు అరకొరగా మాత్రమే వస్తున్నాయి. ఏప్రిల్ రెండో వారంలోనే ఆనకట్టలో నీళ్లు లేకపోతే నడి వేసవిలో రానున్న 40 రోజుల పాటు నీటి ఎద్దడి జఠిలంగా మారే ప్రమాదం పొంచి ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో ఫణి రాజకుమారి దృష్టికి తీసుకెళ్లగా సమస్యను జిల్లాస్థాయి అధికారులకు తెలియజేసి తాగునీటి సమస్య ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు.